ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
1
శుక్రవారం 26 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.140	204	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.5 । కనిష్ఠం 24.8

ప్రమాదాలతో తెల్లవారుతోంది

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. హైవేపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అతివేగం, అజాగ్రత్త, ప్రధాన కారణం కాగా, దూరప్రయాణంతో అలసిపోతున్న డ్రైవర్లు తెల్లవారుజామున నిద్రమత్తులో నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నెల 22న మునగాలలో ఆగి ఉన్న లారీని ఢీకొని దంపతుల మృతిని మరిచిపోకముందే గురువారం తెల్లవారుజామున కోదాడ మండలం శ్రీరంగాపురంలో అదే తరహాలో మరో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏకంగా ఆరుగురు ప్రాణాలను కోల్పోయారు.

● కోదాడ / కోదాడ టౌన్

● మునగాల ఘటనను మరిచిపోక ముందే మరో ఘటన ● ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు ● ఆరుగురిని మింగిన అతివేగం ● కోదాడ సమీపంలో ఘటన ● తల్లిదండ్రులు, తాత, నాయనమ్మ మృతి ● ఒంటరైన చిన్నారులు ● భర్త, కుమార్తెను కోల్పోయిన ఇల్లాలు



శ్రీరంగాపురం వద్ద లారీ కిందికి దూసుకెళ్లిన కారు



కారులో చిక్కుకున్న మృతదేహాలు

శ్రీరంగాపురం వద్ద రోడ్డుపై నిలిచిన లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. లారీ కిందకు కారు దూసుకెళ్లి చిక్కుకోవడంతో క్రేన్‌సహాయంతో మృతదేహాలను, క్షతగాత్రులను బయటకుతీశారు. కారులో 10మంది ఉండగా ముగ్గురు దంపతులతో పాటు నలుగురు చిన్నారులు ఉన్నారు. ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు తాతయ్య, నాయనమ్మలను కోల్పోయి ఇద్దరు చిన్నారులు ఒంటరయ్యారు. అదేవిధంగా తండ్రి, కుమార్తె మృతి చెందారు.

రెండు రోజుల్లో ఎనిమిది మంది

హైదరాబాద్-విజయవాడ హైవే రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లాలనుకునే వారికి ఇదే ప్రధాన రహదారి. విజయవాడకు తెల్లవారుజామున చేరుకోవాలనుకునే వారు హైదరాబాద్‌లో అర్థరాత్రి సమయంలో బయలుదేరుతారు. అప్పటికే రోజువారి పనులతో అలసటతో ఉండే డ్రైవర్లు సూర్యాపేట దాటే వరకు సుమారు 150 కిలోమీటర్లు ప్రయాణించి బడలికలో ఉంటుంటారు. అయితే అప్పటికే తెల్లవారుజాము అవుతుండటంతో చల్లనిగాలికి నిద్రమత్తులోకి జారుకుంటుంటారు. ఈ మత్తులో ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగంగా ప్రయాణిస్తూ ఆగి ఉన్న వాహనాలను గుర్తించలేకపోతుండటం, నిద్రమత్తులోకి వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 22న మునగాలలో ఆగి ఉన్న లారీని అతివేగంగా కారు ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు మృతి చెందారు. అది మరిచిపోకముందే శ్రీరంగాపురం ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఇలా తెల్లవారేలోగా హైవేపై ప్రమాదాలు సాధారణమవుతున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు అతివేగంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఇంటిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

ముచ్చట తీరకుండానే మృత్యుఒడిలోకి

- 3లో

జిల్లా పరిధిలో 20 మంది

జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో 20 మంది మృతి చెందారు. ఖమ్మం ఫ్లైఓవర్‌పై జరిగిన ప్రమాదంలో ముగ్గురు, సూర్యాపేట సమీపంలో కారు, లారీకి మధ్య ఆటో చిక్కుకున్న సంఘటనలో ఆరుగురు, టేకుమట్ల వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు, ముకుందాపురం వద్ద ఇద్దరు, కోదాడ వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఆరుగురు మొత్తంగా 20మంది మృతి చెందారు.

కనిపించని భద్రతా చర్యలు

హైవేపై ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా నేషనల్ హైవే అథారిటీ వారు భద్రతా చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది. వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా బ్లాక్ స్పాట్(నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల) వద్ద చర్యలతో పాటు అవసరం ఉన్న చోట ఫ్లైఓవర్లను నిర్మించి, ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే హడావిడి చర్యలు కాకుండా ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

116 మంది అభ్యర్థులు నామినేషన్లు 224



భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన పార్టీ నాయకులు

నల్లగొండ టౌన్/భువనగిరి అర్బన్, ఏప్రిల్ 25: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాలకు 116మంది 224సెట్ల నామినేషన్లు దాఖలైనట్లు యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల రిటర్నింగ్ అధికారులు హనుమంతు కే.జెండగే, హరిచందన దాసరి తెలిపారు. నల్లగొండ జిల్లాలో మొత్తం ఇప్పటి వరకు 57 మంది అభ్యర్థులు 114 సెట్ల నామినేషన్లు వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పార్లమెంట్ స్థానానికి 59మంది 110 సెట్ల నామినేషన్లు వేశారు. ఈ నెల 26న స్క్రూట్నీ నిర్వహించడంతోపాటు 29న ఉపసంహరణకు అవకాశం ఉంది.

చివరి రోజు నామినేషన్లు ఇలా..

చివరి రోజు గురువారం నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 31, భువనగిరి స్థానానికి 34 మంది మొత్తం 65 మంది నామినేషన్లు దాఖలుచేశారు. జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన నామినేషన్లు స్వీకరించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి కలెక్టరేట్‌లో భువనగిరి లోక్‌సభ స్థానానికి వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేశారు. 34 మంది అభ్యర్థులు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు అందజేశారు. ఈ నెల 18న తొలి రోజు నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి నాలుగు, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం వేచి చూసి కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులతో రోడ్‌షో, ర్యాలీలు, సభలతో అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. 19న నల్లగొండలో నాలుగు, భువనగిరిలో ఐదు నామినేషన్లు వచ్చాయి. 20వ తేదీన నల్లగొండలో ఏడు, భువనగిరిలో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 21వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలో నామినేషన్లు జోరుగా దాఖలయ్యాయి. 21న సెలవు దినం. 22న నల్లగొండలో 10, భువనగిరిలో 11, 23న నల్లగొండలో 8, భువనగిరిలో 18, 24వ తేదీన నల్లగొండలో 22, భువనగిరిలో 20 నామినేషన్లు దాఖలయ్యాయి.



కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న కేసీఆర్

దేవుడితో రాజకీయాలా

- ఒకరు పేరుతో.. మరొకరు ఓట్లతో
- రూ.1200కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించినా ఎన్నడూ ఓట్ల కోసం వాడుకోలేదు
- గురుకులాల నిర్వహణ లోపంతోనే భువనగిరి విద్యార్థి మృతి
- మాజీ సీఎం కేసీఆర్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 25: ఒకరేమో దేవుడి పేరుతో.. మరొకరు దేవుడిపై ఒట్లతో రాజకీయాలు చేస్తూ ఓట్లు అడుగుతున్నారని, కానీ తాను సీఎంగా ఉన్నప్పుడు రూ.1200కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించినా ఎన్నడూ ఆ పేరుతో ఓట్లు అడగలేదని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా గురువారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. పచ్చబియ్యం, పులిహోర పేరుతో ఓట్లను అడుగుతున్న పార్టీకి, దేవుడి పేరుతో అబద్ధపు ఒట్లు పెడుతున్నా పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాల విద్యార్థులు చదువుకొని భవిష్యత్‌లో ఉత్తమంగా స్థిరపడాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 1,100 గురుకులాలను ఏర్పాటు చేసి సమర్థంగా నిర్వహించామన్నారు. నేటి కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో విద్యార్థులకు విష ఆహారాన్ని పెడుతుండడంతో భువనగిరి గురుకులం విద్యార్థి మృతి చెందాడని విమర్శించారు. బీఆర్ఎస్ భువనగిరి మునిసిపల్ చైర్మన్‌ను గద్దెదించి చైర్మన్ పదవిని కాంగ్రెస్, వైస్‌చైర్మన్ పదవిని బీజేపీ కూడబల్లుకొని దక్కించుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలు పరస్పర బీ-టీములని రుజువైందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి బస్వాపూర్ ప్రాజెక్ట్‌ను నిర్మించి సాగు నీరు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ సొంతమన్నారు.

బీజేపీ పదేళ్ల పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదని, పైగా వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేసిన ఆ పార్టీ, రైతుల ఓట్లను ఏ మొఖం పెట్టుకొని అడుగుతోందని విమర్శించారు. స్వరాష్ట్రంలో అనుకోని పరిస్థితుల నేపథ్యంలో నాలుగు నెలల క్రితం ప్రారంభమైన సమైక్య పాలనకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి గాడి తప్పిన తెలంగాణ పాలన, అభివృద్ధిని చక్క దిద్దుతానన్నారు.



భువనగిరిలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్, జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

కేసీఆర్‌ను కలిసేందుకు తరలివచ్చిన శ్రేణులు

సూర్యాపేట(కలెక్టరేట్)/ అర్వపల్లి/ తిరుమలగిరి, ఏప్రిల్ 25: మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం సూర్యాపేటలోని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి రోడ్ అనంతరం ఇక్కడే ఆయన బసచేశారు. విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు అధినేతను కలుసుకునేందుకు తరలిరాగా, మధ్యాహ్నం తర్వాత నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులను కేసీఆర్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి ప్రతి ఒక్కరినీ కేసీఆర్‌కు పరిచయం చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గంలో భువనగిరికి బయలుదేరివెళ్లారు.

పూలుచల్లి స్వాగతం

మాజీ సీఎం కేసీఆర్‌కు అర్వపల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి వాహనశ్రేణిపై పూలచల్లి అభిమానం చాటు కున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, గుండగాని సోమేష్‌గౌడ్, మొరిశెట్టి ఉపేందర్, బైరబోయిన రామలింగయ్య, విజయ్, కడారి నర్సయ్య, పాల్గొన్నారు. అదేవిధ ంగా తిరుమలగిరికి చేరుకోగానే పార్టీ శ్రేణులు పెద్దఎత్తున్న నినాదాలు చేశారు. బస్‌లో నుంచే కేసీఆర్ శ్రేణులకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, నరేష్, నాని పాల్గొన్నారు.



సూర్యాపేటలో పార్టీ శ్రేణులతో కేసీఆర్

ఓటరు స్లిప్‌లు ప్రతి ఇంటికీ అందాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్‌లు అందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్ హెగ్డే, జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి గురువారం వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారులు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీలోపు ఓటరు స్లిప్‌లు ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు పర్యవేక్షణ చేసి రోజువారి నివేదికలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజకీయ నాయకులు సహకరించాలి

ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు సహకరించాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి వివిధ రాజకీయ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే హోం ఓటింగ్ కోసం 12(డీ) ఫాంలను 6,070 మందికి ఇచ్చామన్నారు. ఇప్పటివరకు 354 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, ఏవో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి

ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో 95 శాతం ఓటర్ టర్నవుట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి వారిని అవగాహన కల్పించి, 100శాతం ఓటు నమోదయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల ఓటు హక్కుపై అవగాహనపై నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, డీఐఈవో జానపాటి కృష్ణయ్య, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట మార్కెట్‌లో లారీలోకి ధాన్యం బస్తాలను ఎగుమతి చేస్తున్న హమాలీలు

ఖరీదుదారులకు నోటీసులు

● ధాన్యం ఎగుమతి నిలిచిపోవడంపై సమాధానం ఇవ్వాలని ఆదేశం
● హమాలీల అవకాశం మేరకు కొనుగోలు చేయాలని సూచన

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 25 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఎగుమతి చేయకుండా ధాన్యం బస్తాలు నిల్వ చేసిన ఖరీదుదారులకు కార్యదర్శి బీవీ రాహుల్ నోటీసులు గురువారం జారీ చేశారు. సుమారుగా 75 మందికి నోటీసులు జారీ అయ్యాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఎగుమతి చేయకుండా మార్కెట్‌లోనే నిల్వ ఉంచడానికి గల కారణాలను తెలియజేయాలని ఆయన నోటీసులో ఆదేశించారు. హమాలీలు లేకున్నప్పటికీ ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు ఎందుకు చేశారని, వాటిని ఎగుమతి చేయకుండా లావాదేవీలకు ఆటంకం కలుగజేస్తున్న మీపై ఎందుకు చర్యలు తీసుకోవద్దు అంటూ ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు. ఖరీదుదారులు హమాలీల లభ్యత మేరకే కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.

కదలించిన కథనం

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం బస్తాల నిల్వలపై ఆంధ్రజ్యోతి మినీలో గురువారం 'ధాన్యం తెచ్చి ఇబ్బందిపడొద్దు' అంటూ కథనం ప్రచురితమైంది. కథనంలో రైతుల ఇబ్బందులతో పాటు ఖరీదుదారులు ఎగుమతి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును వెలుగులోకి తెచ్చింది. కథనానికి స్పందించిన అధికారులు ధాన్యం ఎగుమతి చేయని ఖరీదుదారులకు నోటీసులు అందజేశారు. అదేవిధంగా వెంటనే ఎగుమతి చేయాలని ఆదేశించారు. మార్కెట్ అధికారుల హెచ్చరికలతో వాహనాలను తీసుకువచ్చి ధాన్యం బస్తాలను ఎగుమతులను ప్రారంభించారు.

కొనసాగుతున్న సూర్యప్రతాపం

● జిల్లా అంతటా 40 డిగ్రీలకు పైగా నమోదు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 25 : జిల్లాలో సూర్య ప్రతాపం కొనసాగుతూనే ఉంది. గురువారం అత్యధికంగా పెన్‌పహాడ్ మండలం కేంద్రంలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యల్పంగా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో 40.5 డిగ్రీలుగా నమోదైంది. అదేవిధంగా మునగాల 44.7, మోతెలో 44.6, నూతనకల్‌లో 44.5, సూర్యాపేటలో 44.4, అనంతగిరిలో 43.5 డిగ్రీల ఉష్ణోగత నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు.

చిరువ్యాపారులకు గొడుగే రక్ష

తిరుమలగిరి: వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. బయటకు వెళ్లే సమయంలో నెత్తిన టవళ్లతో పాటు శీతలపానియాలు, కొబ్బరినీరు తాగుతూ ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు తిరుమలగిరి మునిసిపాలిటీలో నిర్వహించే వారాంతపు సంతలో మధ్యాహ్నం ఎండవేడిమికి తట్టుకోలేక చిరువ్యాపారులు గొడుగులను ఏర్పాటుచేసుకున్నారు.



తిరుమలగిరిలోని వారాంతపు సంతలో గొడుసుల కింద వ్యాపారం చేస్తున్న చిరువ్యాపారులు


న్యుమోనియా నివారణకు వ్యాక్సిన్

మిర్యాలగూడ, ఏప్రిల్ 25: న్యుమోనియా నివారణకు వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని ఫిజిషియన్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బ్రాంకో న్యుమోనియాపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఐదేళ్ల ఏళ్లలోపు పిల్లలకు, 60 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. న్యుమోనియా సాధారణ వ్యాధి అయినప్పటికీ నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తుందన్నారు. పొగ తాగడం, అతిచల్లని ద్రవాలు తీసుకోవడం, కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల్లోకి వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ ప్రవేశించి న్యుమోనియా బారీన పడతారని అన్నారు. ఆయాసం, శ్వాసతీసుకోలేక పోవడం, వాయుమార్గాల్లో మంటగా ఉండడం వల్ల వాయుకోశాలు ఉబ్బడం సంభవిస్తాయన్నారు.

















శాస్త్రోక్తంగా తిరుకల్యాణం

● నిత్య ఆదాయం రూ.21.43లక్షలు



ప్రధానాలయంలో నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భువనగిరి అర్బన్, ఏప్రిల్ 25: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమ రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా జరిగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 21,43,609 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.









నీటి ఎద్దడి లేకుండా చర్యలు

»ముందస్తు ప్రణాళికతో అడుగులు » పొదుపే నీటి మంత్ర మంటున్న మునిసిపల్ అధికారులు



మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలో 48 వార్డులు ఉండగా,జనాభా 1,40,720కి చేరింది. ఇక పట్టణంలో 20,050 నల్లాకనెక్షన్లు ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్స్ 76 ఉండగా మరో ఏడు ఇండస్ట్రీయల్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పట్టణానికి నిత్యం 14.50 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది. పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌తో పాటు అవంతీపురంలోని మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా పట్టణానికి నీటి సరఫరా జరుగుతోంది. పట్టణంలో పట్టణ పరిధిలోని 70 శాతం నల్లాలకు నిత్యం నీటి సరఫరా జరుగుతుండగా 30 శాతం రోజు విడిచి రోజు తాగునీటిని గంట సేపు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నీటి లెక్కలిలా..

పట్టణ పరిధిలో 387 చేతి పంపులు (బోర్లు) ఉండగా అందులో 358 వినియోగంలో ఉండగా మరో 29 బోరు పంపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక 97 పవర్ బోర్లలో 75 వినియోగంలో ఉండగా 22 పవర్ బోర్లు పని చేయడం లేదు. ఇక పట్టణంలోని 18 వాటర్‌ట్యాంకులు ఉండగా నీటి ఎద్దడి ఏర్పడిన తరుణంలో ఆయా వార్డులకు నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లను వినియోగించనున్నారు. మునిసిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్లతో పాటు అదనంగా అద్దె ట్యాంకర్లను వినియోగించనున్నారు.

నీటి సమస్యలను పరిష్కరించడానికి హెల్ప్‌లైన్

తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి మునిసిపల్ అధికారులు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు, అవాంతరాలు వచ్చిన యెడల 9010164671 నెంబరుకు సమాచారం అందిస్తే వెనువెంటనే సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటర్ సరఫరా సిబ్బందితో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- మిర్యాలగూడ టౌన్

నీటి ఎద్దడి రానివ్వం



పట్టణంలో నీటిఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ప్రస్తు తం సరఫరా అవుతున్న నీటి గణాంకాల తో రాబోయే 90 రోజులకు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు నీటి సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశాం. నీటి వృథాను అరికట్టేందుకు పట్టణ ప్రజలు సహకరించాలి. ప్లాస్టిక్‌ను నియంత్రించడంతో పాటు మొక్కలు పెంచితే భావి తరాలకు నీటి ఇబ్బందులు ఉండవు.

- తిరునగరు భార్గవ్, మునిసిపల్ చైర్మన్

శాశ్వత పరిష్కారానికి చర్యలు



తాగునీటి సమస్య రాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. చేతిపంపులు, బోర్లన్నీ వినియోగంలోకి తెస్తున్నాం. నీటి లభ్యత స్థలాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయిస్తాం. నీటి పొదుపుతో పాటు భుగర్భజలాలను పెంచేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నూతన నిర్మాణాల్లో ఖచ్చితంగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయిస్తాం. నిర్మాణ అనుమతు లు పొంది ఇంకుడు గుంతలు నిర్మించని వారికి నోటీసులిస్తున్నాం.

- ఎండీ. యూసుఫ్, మునిసిపల్ కమిషనర్

చిట్యాల మునిసిపాలిటీలోనూ...

చిట్యాల: మునిసపాలిటీ పరిధిలో 3574 ఇళ్ల ఉన్నాయి. 4100 ప్రైవేట్ నల్లా కనెక్షన్లు ఉండగా సుమారు 300 వరకు పబ్లిక్ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మునిసిపాలిటీ ప్రజలకు మిషన్ భగీరథ కృష్ణా నీటితో పాటు స్థానికంగా ఉన్న బోరుబావుల ద్వారా నీటిని అందిస్తున్నారు. మునిసిపాలిటీకి ప్రతీ రోజు 2.4 మిలియన్ లీటర్లు అవసరం ఉండగా 2.38 మిలియన్ లీటర్ల కృష్ణానీటి సరఫరా అవుతుంది. స్థానికంగా ఉన్న 28 బోరుబావుల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి సుమారు సుమారు 100 మిలియన్ లీటర్ల అవసరం ఉండగా డిమాండ్ మేరకు నీటిని సరఫరా చేస్తామని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం మునిసిపాలిటీలో ప్రతీరోజు నీటి సరఫరా చేస్తున్నారు. ఏ వార్డులో కూడా నీటి ఎద్దడి లేదు.

వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటడంతో నీటిఎద్దడి ఏర్పడుతోంది. మునుపెన్నడూ లేని విధంగా వేసవి ఆరంభంలోనే కలవరపెడుతోంది. భానుడి భగభగలు మొదలవడంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. బయటికి వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. జంతువులు, పక్షుల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. నీడ కోసం, దాహం తీర్చుకోవాడానికి అల్లాడుతున్నాయి. తాగు, సాగు నీటి సమస్యను అధిగమించేందుకు ప్రభు త్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నీటి సమస్య రాకుండా ఉండేందుకు అధికారులు సన్నద్ధవుతున్నారు.

నీటి కోసం మూగజీవాల తండ్లాట

మోటకొండూరు: వేసవి తీవ్రతరం అవుతుండడంతో మూగజీవాలు దప్పికతో అల్లాడుతున్నాయి. వేసవి ప్రారంభం నుంచే బోర్లు, బావులు, చెరువులు, కుంటలు ఎండుతున్నాయి. దీంతో దాహార్తితో నీటి కోసం అక్కడ ఇక్కడా తండ్లాడుతున్నాయి. జీవాలున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. మోటకొండూర్ మధిర గ్రామం రాయికుంటపల్లి గ్రామానికి చెందిన రైతుకు తాడబోయిన యాదయ్య వద్ద ఎనిమిది మూగజీవాలు ఉన్నాయి. ఎండలకు తన బోరు ఎండిపోయింది. దీంతో పక్కన ఉన్న రైతు బోరు సాయంతో జీవాల దాహం తీర్చుకోవడం కోసం గాడి ఏర్పాటు చేసి వాటి దాహం తీరుస్తున్నాడు.



రాయికుంటపల్లిలో రైతుఏర్పాటు చేసిన కుంటలో దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

డిండి ప్రాజెక్టు నీరు వృథాగా..



డిండి : వేసవిలో తాగు నీటి ఎద్దడిని అధిగమించేందుకు విడుదలచేసిన డిండి ప్రాజెక్టు నీరు వాగులు, వంకలు, బీడు భూములవెంట వృథాగా పోతోంది. డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో చెరువులు, కుంటలు నింపేందుకు ఈ నెల 15న ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డిండి ప్రాజెక్టు నీటిని నీటిపారుదలశాఖ అధికారులు విడుదల చేశారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలో పశువులకు తాగునీటిని అందించడంతోపాటు భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య ఈ వేసవిలో కొంతమేరతీరుతుందని భావించి డిండి నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేశారని, నీరు వృథా కాకుండా అధికారులు చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని తూములకు తలుపులు లేకపోవడంతో బీడుగా ఉన్న భూములకు నీరు వెళ్తోంది. కాల్వలు కూడా లీకేజీ అవుతున్నాయి. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 36అడుగులు(2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 28.6 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. డిండి మండలంలోని 18చెరువులు, కుంటలతోపాటు చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని 14 కుంటలు నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధాన కాలువల ద్వారా కుంటలు, చెరువులకు నీరు చేరాల్సి ఉండగా పిల్ల కాల్వలు ద్వారా నీరు ప్రవహించి బీడు పొలాలు పారుతున్నాయి. విలువైన నీరు వృథాగా పోవడంపై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిండి ప్రాజెక్టు నీరు వృథా కాకుండా అరికడతామని ప్రాజెక్టు ఈఈ శ్రీధర్‌రావు తెలిపారు. ఎక్కడ నీటిలీకేజీ ఉందో గుర్తించి అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి : సపావట్ కృష్ణ, జేత్యతండా.

డిండి ప్రాజెక్టునీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. తూములకు తలుపులు బిగించి నీటిని కాపాడాలి. వాగులు, వంపులలోపడి నీళ్ల వృథాగా పోతున్నాయి.

కరువులోనూ కోనేరులో జలకళ

దేవరకొండ: క్రీస్తు శకం 13వ శతాబ్దంలో రేచర్ల పద్మనాయన వెలమరాజులు దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని క్రీస్తు శకం 1326 నుంచి 1475 వరకు 149 సంవత్సరాలు పరిపాలించిన చరిత్ర ఉంది. 750సంవత్సరాలకు పూర్వం ఏడు కొండలు కలుపుతూ దేవరకొండ దుర్గాన్ని నిర్మించారు. అప్పటి నుంచి దేవరకొండ ఖిల్లాలోని కోనేరు ఎంతటి కరువు పరిస్థితులు వచ్చినా ఎండిపోలేదు. పచ్చికొబ్బరినీరును తలపించే విధంగా కోనేరు నీరు ఉండడంతో ఇప్పటికీ దేవరకొండ ఖిల్లా సందర్శించడానికి వెళ్లిన పర్యాటకులు, మేకలు, గొర్రెలకాపర్లు ఖిల్లాలోని కోనేరు నీరే తాగడం గమనార్హం. అంతటి చరిత్ర ఉన్న ఖిల్లాలోని కోనేరుకు నీరు ఎక్కడి నుంచి వస్తుందో ఇప్పటికి అంతుచిక్కని పరిస్థితి. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోయి దేవరకొండ డివిజన్‌లో చెరువులు, కుంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు ఉన్నా దేవరకొండ ఖిల్లాలోని కోనేరులో నీరు సంవృద్ధిగా ఉన్నాయి.



మండు వేసవిలో కోనేరులో జలం

గ్రామానికి అంతా ఒకే బోరు

త్రిపురారం: త్రిపురారం మండలంలోని కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెంలో మొత్తం 200 జనాభా ఉంది. మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్నా మరమ్మతులకు గురైంది. మూడు రోజుల కొకసారి కొన్ని నీళ్ల వచ్చినా పైపులైన్‌ల లీకేజీతో ఇళ్లకు రావడం కష్టంగా మారింది. అధికారులుకు ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు చెపుతున్నారు. ఐదువేల లీటర్ల సామర్థం ఉన్న వాటర్ ట్యాంకు ఉన్న నీళ్ల రాక ఐదేళ్ల నుంచి నీరు రాక పడావుపడిపోయింది. చేతి పంపులు రెండు ఉన్న మూడు సంవత్సరాల నుంచి పని చేయడం లేదు. గ్రామానికి ఇంచు నీరు పోసే మోటారు బోరు మాత్రమే ఉంది. దీంతో ప్రజలంతా ఉదయం సాయంత్రం బోరు నుంచే నీటిని పట్టుకోవడానికి బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజు పనులు మానుకుని నీళ్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని గ్రామస్థులు వేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. వారానికోసారి ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా చేస్తున్నా నీటి సమస్య తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు.





నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంక్, మరమ్మతుకు గురైన చేతిపంపు

భారీగా చేరుతున్న వరద నీరు

శాలిగౌరారం: నల్లగొండ జిల్లాలో మధ్యతరహా నీటి ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నీటి మట్టం మండుటెండల్లోనూ పెరుగుతూ వస్తుంది. గత వారం రోజుల కిందట అడుగంటిన ప్రాజెక్టు నీటిమట్టం మూసీనది ప్రవహిస్తుండటంతో పల్లివాడ ఫీడర్‌ఛానల్ నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా హైద్రాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో క్రమేపీ పెరుగుతున్న నీటి మట్టం బుధవారం సాయంత్రం నాటికి 9 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టు పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద రాక రాబోయే 20 రోజుల పాటు ఇలానే కొనసాగితే ప్రాజెక్టు నిండే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరద నీటి ప్రవాహంతో ఫీడర్ చానల్ ఎగువన ఉన్న చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి.



శాలిగౌరారం ప్రాజెక్టులో పెరుగుతున్న నీటి మట్టం

ఎండిన పంట.. పశువులకు మేత

పెద్దఅడిశర్లపల్లి: భూగర్భ జలాలు అడగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరిపంట ఎండిపో వడం.. బావులు, బోర్లలో నీళ్ల లేకపోవడంతో చేసేదేమి లేక రైతులు పంటలు వదిలేస్తున్నారు. పీఏపల్లి మండలకేంద్రానికి చెందిన రైతు గోర్ల వెంకటయ్య రెండు ఎకరాల్లో వరిపంట సాగు చేశాడు. ఎకరాకు రూ.25వేల చొప్పున ఖర్చు చేశాడు. పొలం వడ్ల దశలో ఎండిపోతుండడంతో పంటను కాపాడుకునేందుకు బత్తాలు తోటకు నీళ్ల ఆపివేసి వరిపంటకు పెట్టాడు. విపరీతమైన ఎండలకు బావిలోని నీళ్ల తగ్గడంతో ఇటు తోటను కాపా డుకోలేక, ఎండిపోతున్న వరిపంటను కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. చివరకు రెండు ఎకరాల వరిపంటను వదిలేసి వచ్చే ఆ తక్కువ నీటితో బత్తాయి తోటకు నీళ్ల పెడుతూ తోటను కాపాడుకుంటున్నాడు. గత్యంతరంలేక వడ్లదశలో ఉన్న పొలంలో తన గేదెలను, ఆవులను వదిలేశాడు.



పీఏపల్లిలో ఎండిన పంట పొలంలో పశువులు

పెనగంచిప్రోలులో ఎల్లయ్య కారు లభ్యం

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 25: సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఎల్కారం గ్రామవాసి వడ్డె ఎల్లయ్య మిస్సింగ్ మిస్టరీ త్వరలోనే వీడనుంది. ఎల్లయ్య ఈ నెల 18వ తేదీ నుంచి కన్పించకుండా పోయాడు. ఇప్పటివరకు ఆయన ఆచూకీ లభించలేదు. డబ్బుల పంచాయితీ విషయంలో ఓ మహిళ ఎల్లయ్యను జగ్గయ్యపేటకు తీసుకెళ్లింది. ఆ తర్వాత ఎల్లయ్య సంబంధించిన మహిళా కన్పించకుండా పోయింది. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న జగ్గయ్యపేట పోలీసులతో పాటు సూర్యాపేట పోలీసులు కూడా పలు బృందాలుగా ఏర్పడి విచారణ చేస్తున్నారు. అందులో భాగంగా పలువురు అనుమానితుల సెల్‌ఫోన్ సిగ్నల్స్, వారి వాహనాల రాకపోకల వివరాలు సేకరించినట్లు సమాచారం. కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎల్లయ్య జగ్గయ్యపేటకు వెళ్లేందుకు సూర్యాపేటకు చెందిన కట్టెకోత మిషన్ యజమాని కారు తీసుకెళ్లాడు. ఆ కారు పెనుగ్రంచిపోలు మండల పరిధిలోని జాతీయ రహదారి సమీపంలోని ఓ ఫ్యాక్టరీ పక్కన ఉన్నట్లు జగ్గయ్యపేట పోలీసులు గుర్తించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఎల్లయ్యను హత్యచేసి మృతదేహం దొరకకుండా ఎక్కడో పడవేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లభించిన ఆధారాల ప్రకారం నిందితులను త్వరలోనే పట్టుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



చేపలు పట్టేందుకు వెళ్లి..

భువనగిరి రూరల్, ఏప్రిల్ 25: చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అనాజీపురంలో గురువారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అనాజీపురానికి చెందిన కుంచం ఉప్పలయ్య(53) అతని కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం 15సంవత్సరాలుగా భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీలో నివాసంఉంటూ తాపీ మేస్త్రీపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఈ నెల 23వ తేదీన స్వగ్రామమైన అనాజీపురంలో కోర లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కోసం కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామానికి వచ్చాడు. గురువారం భువనగిరికి వెళ్తున్న క్రమంలో భార్య జయమ్మతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు గాలం ద్వారా చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గమనించిన భార్య జయమ్మ పెద్ద ఎత్తున కేకలు వేయడంతో అక్కడున్న వారు చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఐదు గంటల పాటు శ్రమించి ఉప్పలయ్య మృతదేహాన్ని బయటికి తీసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉప్పలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తె ఉన్నారు.

చెరువులో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లగూడెంలో చెరువులో ఈతకు వెళ్లి గల్లంతైన గట్టుప్పల మండలం అంతంపేట గ్రామానికి విద్యార్థి మృతదేహం గురువారం లభ్యమైంది. ఈతకు వెళ్లిన మహ్మద్ ఖలీల్(16) బుధవారం చెరువులో గల్లంతయ్యాడు. బుధవారం రాత్రి రాత్రి ఏడు గంటల వరకు గజ ఈతగాళ్లు చెరువులో వెతికినా సాధ్యం కాలేదు. గురువారం ఉదయం ఎస్ఐ రంగారెడ్డితో 20మంది గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా ఉదయం 10గంటలకు మృతదేహం లభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఖలీల్ తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఖలీల్ మృతితో స్వగ్రామం అంతంపేటలో విషాదచాయలు అలుముకున్నాయి.

ముచ్చట తీరకుండానే మృత్యుఒడిలోకి..

కోదాడ / కోదాడ టౌన్, ఏప్రిల్ 25 : కుమార్తె చెవులు కుట్టించాలన్న తండ్రి, పుట్టు వెంట్రుకలు తీయించాలకున్న తాత, అమ్మమ్మ, మామ, అత్తల కోరిక తీరలేదు. ఆ ముచ్చట తీర్చుకునేందుకు వెళ్తున్న వారిని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన జిల్లా శ్రీకాంత్(32), నాగమణి దంపతులకు లాస్య(4), లావణ్యలు ఉండగా, ఆయన బావమరిది నల్లమల కృష్ణరాజు(26), స్వర్ణకుమారి(23) దంపతులకు కౌశిక్, కార్తీక్‌లు ఉన్నారు. వీరితో పాటు కృష్ణరాజు తల్లిదండ్రులు చందరావు(50), మాణిక్యమ్మ(45)లు ఉంటున్నారు. శ్రీకాంత్ భార్య నాగమణి స్వయాన కృష్ణరాజు చెల్లెలు. ఇద్దరూ హైదరాబాద్‌లో డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారు. లావణ్య పుట్టువెంట్రుకలతో పాటు చెవులు కుట్టించాలన్న తండ్రి శ్రీకాంత్, తాత, అమ్మమ్మ చందరావు, మాణిక్యమ్మ, మామ కృష్ణరాజులు నిర్ణయించారు. ఇందుకోసం బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కారులో ఇరుకుటుంబాల సభ్యులందరూ కలిసి కారులో విజయవాడలోని గుణదల మేరీమాత దేవాలయానికి బయలుదేరారు. కోదాడ సమీపంలోని శ్రీరంగాపురం వద్ద హైవేపై నిలిచిన లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే శ్రీకాంత్‌తో పాటు పెద్దకుమార్తె లాస్య, అత్తామామ చందరావు, మాణిక్యమ్మ, బావమరిది కృష్ణరాజు, స్వర్ణకుమారి మృతి చెందారు. శ్రీకాంత్ భార్య నాగమణితో పాటు చిన్నకుమార్తె లాస్య, కృష్ణరాజు కుమారులు కౌశిక్, కార్తీక్‌లు గాయాల పాలయ్యాయి. శ్రీకాంత్ సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రి వద్ద రోధిస్తున్న బంధువులు



ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారి లావణ్య, కౌశిక్, కార్తిక్

చివరి మాటలు అవుతాయని అనుకోలేదు : మేరి కుమారి

'పెద్దమ్మ మేం వస్తున్నాం రెడీగా ఉండు, వెంటనే దేవాలయానికి వెళ్దాం' అన్న మాటలు చివరివి అవుతాయని అనుకోలేదని శ్రీకాంత్ పెద్దమ్మ మేరికుమారి కన్నీటి పర్యతమైంది. మంగళవారం రాత్రి గంటలకు 3.33నిమిషాలకు వస్తున్నట్లు శ్రీకాంత్ ఫోన్ చేశాడని తెలిపింది. ఐదు గంటలకు ఫోన్‌చేస్తే ఎత్తకపోవటంతో హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్‌కు ఫోన్ చేస్తే కోదాడ వద్ద ప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఆరా తీయగా ఆసుపత్రిలో ఉన్నట్లు తెలవడంతో ఆసుపత్రికి వచ్చామన్నారు. ఆరుగురు చనిపోయారని పోలీసులు చెప్పటంతో దిక్కుతోచని స్థితి నెలకొందన్నారు. పగవారికి కూడా ఇటువంటి పరిస్థితి రాకూడదన్నారు.

మృతుల కుటుంబాలకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సంతాపం

జాతీయ రహదారిపై కోదాడ బైపాస్ సమీపంలో దుర్గాపురం స్టేజీ వద్ద తెల్లవారుజామున బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కుటుంబం భార్య భర్తలు మృతిచెందారు. ఆ ఘటన మరువక ముందే ఈ రోజు ఈ ఘటన జరిగి ఆరుగురు మరణించడం చాలా బాధాకరమన్నారు. జాతీయ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా కోదాడలో ట్రామా సెంటర్ ఏర్పాటు అత్యవసరమని, దీని ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు. ఈ విషయాన్ని గతంలో కోదాడలో వంద పడకల హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ట్రామా సెంటర్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

అతివేగమే ప్రమాదానికి కారణం: ఎస్పీ రాహుల్‌హెగ్డే

అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్పీ రాహుల్‌హెగ్గే అన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ వారితో మాట్లాడామని, అతివేగంగా ప్రయాణించే వాహనాలకు గుర్తించేందుకు మూడు స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేశామన్నారు. లారీ యాగ్జిల్ రాడ్ విరిగి లారీ ముందుకు కదల్లేకపోవడంతో రహదారిపై నిలిపారన్నారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమన్నారు.

ఆగిన లారీని ఢీకొట్టిన మరో లారీ

తిప్పర్తి: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం గురువారం తెల్లవారుజామున తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా చేబ్రోలు మండల కేంద్రానికి చెందిన షేక్ నాగుల్‌మీరా(58) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి చేబ్రోలు నుంచి హైదరాబాద్‌కు మినపగుండ్ల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం వద్ద తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ప్లైఓవర్ బ్రిడ్జిపై ఎలాంటి ఇండికేటర్లు, సిగ్నల్స్ లేకుండా ఆపిన మరో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నాగుల్‌మీరాను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు నాగుల్‌మీరా కుమారుడు యూనుస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు.

చిమిర్యాలలో విషాదఛాయలు

● అశ్రునయనాల మధ్య తండ్రీ, కుమార్తె అంత్యక్రియలు

కోదాడ రూరల్ : కోదాడకు దగ్గరలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జిల్లా శ్రీకాంత్, అతని కూతురు లాస్య అంత్యక్రియలు వారి స్వస్థలమైన చిమిర్యాల గ్రామంలో నిర్వహించారు. గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పెద్దఎత్తున విలపించారు. రెండురోజుల కిందటే శ్రీకాంత్ చిమిర్యాలలోని తన పెద్దమ్మ మేరికుమారికి ఫోన్ చేసి తన కూతురు పుట్టువెంట్రుకలు విజయవాడలోని మేరిమాత ఆలయంలో నిర్వహిస్తున్నామని, తనను కూడా తప్పకుండా తీసుకెళ్తామని చెప్పారని ఆమె బోరున విలపిస్తూ తెలిపారు. తన దగ్గరికి రాకుండానే మృత్యువాత పడ్డారని ఆమె విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను ఎస్పీ రాహుల్ హెగ్డే, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు తగిన ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

సూర్యాపేట విచారణ గురువు టి.బాలశౌరెడ్డి

మఠంపల్లి, ఏప్రిల్ 25: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకుని సన్మార్గంలో నడవాలని సూర్యాపేట విచారణ గురువు టి.బాలశౌరెడ్డి అన్నారు. గురువారం మఠంపల్లిలోని శుభవార్త దేవాలయ 29వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏసుప్రభు చూపిన మార్గంలో అందరూ నడచి పునీతులు కావాలన్నారు. పాపుల రక్షకై ఏసుప్రభు మానవ రూపంలో జన్మించారని, ఆయన చూపిన జాలి, దయ, కరుణ మార్గం, ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని సేవా మార్గంలో నడవాలన్నారు. ప్రపంచశాంతికి క్రీస్తు బోధనలే మార్గదర్శకమన్నారు. మఠంపల్లిలోని శుభవార్త దేవాలయానికి రాష్ట్రం లోనే ప్రత్యేకత ఉందన్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రత్యేక ప్రార్థనలు లు నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథం(తేరు)పై మరియమాతను ఉంచి ఆరాధన పాటల పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో బాణసంచా కాల్చుతూ ఆనందోత్సవాల నడుమ వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు గ్రామానికి రావడంతో మఠంపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. శుభవార్త చర్చిలో గాదెసుజాత బృందం పాడిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. దివ్యబలి పూజా కార్యక్రమాన్ని కార్యక్రమంలో ఫాదర్లు అల్లం బాలశౌరెడ్డి, తిరుమల రెడ్డి జోజిరెడ్డి, ఆదూరి స్రవంతికిశోర్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, టీఆర్ రాజారెడ్డి, జయభారత్‌రెడ్డి, ఆదూరి శౌరెడ్డి, గాదె విక్టర్‌రెడ్డి, 30మంది విచారణ గురువులతో పాటు చర్చి కమిటీ పెద్దలు, యువజన సంఘం సభ్యులు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.


దివ్యబలి పూజలో ప్రసంగిస్తున్న విచారణ గురువు బాలశౌరెడ్డి, హాజరైన మత పెద్దలు, భక్తులు

లారీని ఢీకొట్టి వ్యక్తి మృతి


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 25: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఓ వ్యక్తి బైకుతో ఢీకొట్టి మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలంలోని కేటిఅన్నారం గ్రామానికి చెందిన మైలారపు శ్రీరాములు(47) గ్రామంలో కూలికి వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సైదమ్మతో బైకుపై సూర్యాపేటకు వచ్చాడు. భార్యను ఎంజీరోడ్డులోని ఓ దుకాణంలో దింపి శ్రీరాములు తిరిగి బైకుపై స్వగ్రామానికి వెళుతున్నాడు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసమయంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే తన కార్యాలయం నుంచి వెళుతూ గాయపడిన శ్రీరాములును చూసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీరాములు మృతి చెందాడు. రాములుకు కుమార్తె ఉంది. రాములు భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలభోగం, నిత్య హోమం, రథసేవ, గజవాహనంపై ఊరేగించారు. వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ, గోదాదేవి మూర్తులను బూరుగడ్డ గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, హరీష్ కుమారాచార్యులు, మనోహరాచార్యులు, పవన్‌కుమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు, మధుసూదనాచార్యులు, లక్ష్మీనాథాచార్యులు, జనార్ధనాచార్యులు, భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, హరిత, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 25: మట్టపల్లి క్షేత్రంలో గురువారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు పాల్గొన్నారు.

నేడు మానసదేవి విగ్రహ ప్రతిష్ఠ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 25: జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో పరమశివుడి పుత్రిక మానసదేవి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ తెలిపారు. గురువారం సంతోషిమాత దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రతిష్ఠోత్స వానికి పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి మహాస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బెలిదె అశోక్, సోమ శ్రీశైలం, తాళ్లపల్లి రామయ్య, దేవరశెట్టి సోమయ్య, గోపారపురాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, మహంకాళి ఉపేందర్, ముదిరెడ్డి లింగారెడ్డి, నాగమణి, ప్రభావతి, కవిత, అశోకలక్ష్మి, పద్మ, సుగంధమాల, కర్నాటి సూర్యకళ, లీల పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి


పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

చివ్వెంల, ఏప్రిల్ 25: గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో గుడితండాలో ప్రారంభమైన చాంపులాల్ జాతరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో గిరిజనుల ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అబీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో గిరిజనులకు చేసింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దరావత్ వీరన్ననాయక్, మాజీ జడ్పీటీసీ చింతమల్ల రమేష్, నాయకులు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగునాయక్, వెన్న మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25: దేశంలో చట్టాలు అమలుకావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సమాచార హక్కు చట్టం తెలుగు రాష్ట్రాల మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు కోరారు. గురువారం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆర్టీఏ చట్టంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశంలో గాంధీ కుటుంబం త్యాగం మరవలేనిదన్నారు. సోనియా, రాహుల్‌గాంధీలు దేశంలో రెండుసార్లు ప్రధాన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారన్నారు. కాంగ్రెస్ బలహీన పడితే దేశం బలహీనపడుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే సమాచార హక్కు చట్టం సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే లోక్‌పాల్ లాంటి చట్టాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంఏ కరీం, యరమాద కృష్ణారెడ్డి, కోటగిరి దైవాదీనం, ముకుంద రెడ్డి, శివ, చింతకాయల సైదులు, భైరు సైదులు, శ్రీనివాస్, జోసెఫ్‌రెడ్డి, శంకర్, పుల్లయ్య, మహ్మద్ కుర్షీద్, సురేందర్‌రెడ్డి, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరహనుమాన్ శోభాయాత్ర


వీరహనుమాన్ విజయోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

కోదాడటౌన్, ఏప్రిల్ 25: పట్టణంలో గురువారం బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని శ్రీరంగాపురంలో ఉన్న అభయాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే, నల్లగొండ పార్లమెంట్ స్థానంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులతో కలిసి జెండా ఊపి హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయాంజనేయస్వామి కరుణాకటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. అనంతరం పట్టణంలోని ఆంజనేయస్వామి చిత్రపటంతో బైక్ ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో తెలంగాణ బజరంగ్‌దళ్ కోకన్వీనర్ కన్నెబోయిన వెంకట్, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద సురేష్, బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు యాద నవీన్, పట్టణ అధ్యక్షుడు అంబడికర్ర వెంకటేష్, రచ్చ సతీష్, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

తిరుమలగిరి, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని మండలంలోని బూత్ స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రచారం ఈనెల 27న ఉంటుందని తెలిపారు. ప్రచారంలో భాగంగా మునిసిపల్ కేంద్రంలో నిర్వహించే బైకు ర్యాలీని విజయవంతం చేయాలని . కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ కేఃడి సరళ, నాయకులు పాలకుర్తి రాజయ్య, సుంకరి జనార్దన్, జుమ్మీలాల్, పేరాల వీరేష్, కందుకూరి అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి


చిలుకూరులో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, ఏప్రిల్ 25: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కటికం సత్తయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో పోటీలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించేందుకు కార్యకర్తలు శక్తివంచనలేకుండా కృషి చేయాలన్నారు. తాగు, సాగునీటి కష్టాలకు, కరెంట్ కష్టాలకు కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకిత పెరుగుతోందని, కేసీఆర్ పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానీమియా, సొసైటీ చైర్మన్ అల్సకాని జనార్దన్, కస్తూరి నర్సయ్య, కొండా అన్నపూర్ణ, జానకిరామాచారి, కడియాల వెంకటేశ్వర్లు, నాగరాజు, వాసు, బెల్లంకొండ నాగయ్య, తాళ్లూరి శ్రీను, అంబాల వెంకటేశ్వర్లు, షేక్ పాషా, రాంబాబు, లింగరాజు, చిలువేరు నర్సయ్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన శ్లోకా మెడికల్ అకాడమి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని కళాశాల కరస్పాండెంట్ మారం వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం శ్లోకా కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పి.శంకర్ 99.38, ఏ.యక్షేంద్ర94.40, సీహెచ్ వేణుగోపాల్ 90.06శాతం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయ కళాశాల విద్యార్థుల సత్తా

ఐఐటీ మెయిన్స్‌లో ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన జయ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో 10వేల లోపు ర్యాంకులు 16మంది విద్యార్థులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కందిబండ వెంకటేష్ 528, గుజ్జ చందన 954, బి.హర్షిత 1183, ఎం.హర్షిణి 4031, కె.సిద్ధార్థన్ 4098, జి.సింధు, 4451, జి.గోపి 4830, కె.సాయిశివరంజన్ 5921, జి.అక్షయ 6433, జె.గౌతమ్‌కుమార్ 7651, పి.కౌశిక్ 7846, కె.అభిజిత్ 8399, ఎస్.నివేదిత 8985, విష్ణుతేజ9099, ఎస్.దీక్షత 9338, డి.సోమేశ్వర్ 9755ర్యాంకులు సాధించారని తెలిపారు. 129 మంది విద్యార్థుల్లో 48మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు.

98.20పర్సంటైల్ సాధించిన గౌతమ్‌కుమార్


గౌతమ్‌కుమార్

ఆత్మకూర్(ఎస్): జేఈఈ మెయిన్స్-2లో మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన జంగ జానయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు జంగ గౌతమ్‌కుమార్ 98.20పర్సంటైల్ సాధించాడు. గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గౌతమ్‌కుమార్ ఆలిండియా ఓబీసీ స్థాయిలో 7,651వ ర్యాంకు సాధించాడు. సూర్యాపేటలోని జయ కళాశాలలో ఇంటర్మీయట్ చదివిన గౌతమ్‌కుమార్ పదో తరగతి కూడా జయ పాఠశాలలో చదివాడు. జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్-1లో 97.36పర్సంటైల్ సాధించగా, ఏప్రిల్ ఎనిమిదో తేదీ జరిగిన మెయిన్స్-2 లో 98.20పర్సంటైల్ సాధించాడు.


కోదాడలో విద్యార్థులను అభినందిస్తున్న కవిత కళాశాల యాజమాన్యం

కోదాడ టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కవిత శ్రీ విద్య కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ మాదాల శ్రీధర్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు యశ్వంతాచారి బి.అనిల్‌ను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మాదల శ్రీధర్, శ్రీ విద్య ప్రిన్సిపాల్ కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు కవిత, ప్రిన్సిపాల్ గడ్డె రఘు, కోట్యనాయక్, రాముసాయక్, మ్యాథ్స్ రాంబాబు, కెమిస్ట్రీ, రాంబాబు, ఫిజిక్స్ రమేష్, లవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో..


నవదీప్

ఆత్మకూర్ (ఎస్): ఇంటర్మీడియల్ ఫలితాల్లో ఎంపీసీ మొదటి సంవత్సరంలో మండలంలోని మిడ్డనపల్లి గ్రామానికి చెందిన జటంగి వీరయ్య, నాగమ్మ దంపతుల కుమారుడు నవదీప్ 467/470 మార్కులు సాధించాడు. నవదీప్ హైదరాబాద్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు.

ఓటరు స్లిప్పులను ఇంటింటికీ ఇవ్వాలి


ఓటరు స్లిప్పులను చూపుతున్న ఆర్డీవో వేణుమాధవరావు

ఆత్మకూర్ (ఎస్), ఏప్రిల్ 25 : ఎన్నికల్లో బీఎల్‌వో ల పాత్ర కీలకమని ప్రతి ఓటర్ కు ఓటర్ స్లిప్పు అందేలా బీఎల్‌వోల పనిచేయాలని ఆర్డీవో వేణు మాధవరావు అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌వోలు గ్రామస్థాయిలో కీలకంగా పనిచేయాలన్నారు. ప్రతి ఓటర్ కు ఓటు స్లిప్పు అందాలన్నారు. ముందుగా కలెక్టర్ నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన బీఎల్వోలు పాల్గొన్నారు.

చిలుకూరు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్క ఓటరుకు సకాలంలో ఓటరు స్లిప్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ధ్రువకుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటరు స్లిప్‌ల పంపిణీపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు మూడు రోజుల ముందే స్లిప్‌లు ఓటర్లకు అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీఎల్వోలకు ఓటర్ స్లిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీటీ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ శైలజ, ఆర్ఐలు సీతయ్య, మంజుల, జూనియర్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ..


జానకమ్మ (ఫైల్ ఫొటో)

నేరేడుచర్ల, ఏప్రిల్ 25: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన బొల్లెద్దు జానకమ్మ(50) బంధువుల ఇంటికి వెళుతుండగా హుజూర్‌నగర్ రోడ్డులోని పంజాబీ దాబా వద్ద గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జానకమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.జానకమ్మ కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం

కోదాడ రూరల్, ఏప్రిల్ 25: గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించగా పక్కను ఉన్న జామాయిల్ తోట దగ్ధమైంది. మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన రైతు బారు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నెం.75లో సత్యనారాయణకు నాలుగు ఎకరాల జామాయిల్ తోట ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు తోట సమీపంలో ఉన్న వరి కొయ్యలకు నిప్పటించడంతో ఆ మంటలు తన జామాయిల్ తోటలకు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.4లక్షల ఆస్తి నష్టం జరిగిందని, పక్కనే ఉన్న మరో తోటలోని మామిడి చెట్లు, 'ఉపాధి' పథకంలో రోడ్డు వెంట నాటిని మొక్కలు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు.

వరి కొయ్యల మంటలతో గ్రామస్థుల ఆందోళన

ఆరు గంటలపాటు శ్రమించి అదుపులోకి తెచ్చిన అధికారులు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నడిగూడెం, మండలంలోని కాగిత రామచంద్రపురంలో గురువారం సాయంత్రం ఐదు గంటలకు వరి కొయ్యలకు గుర్తుతెలియని గ్రామస్థులను భయపెట్టాయి. మంటలు గ్రామానికి వ్యాపిస్తాయని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఇన్‌చార్జి ఎంపీవో దుర్గప్రసాద్, తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీవో సయ్యద్ ఇమాంల దృష్టికి తీసుకువెళ్లడంతో, అగ్నిమాపక యంత్రాలను రప్పించారు. విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్, కోదాడ డీఎల్‌పీవో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అధికారులు ఆరు గంటల పాటు శ్రమించి రాత్రి 11గంటల వరకు మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఎంఆర్ బియ్యం ఇవ్వకపోతే చర్యలు

అనంతగిరి, ఏప్రిల్ 25: సీఎంఆర్ కింద ధాన్యం తీసుకున్న మిల్లర్లు బియ్యం ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని బొజ్జగూడెంతండాలోని వెంకటేశ్వర పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యానికి బియ్యం వెంటనే ఇవ్వాలన్నారు. లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యం ఇవ్వని మిల్లర్లపై కేసులు నమోదు చేశామన్నారు. . కార్యక్రమంలో తహసీల్దార్ సాయిగౌడ్, డీటీసీఎస్ రాంరెడ్డి, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25: పరిశుభ్రతోనే మలేరియాను నివారించవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. గురువారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నివారించాలన్నారు. కార్యక్రమంలో ఇందిరాల రామకృష్ణ, డాక్టర్ వాణి, ఉదయగిరి శ్రీనివాస్, రమేష్, లలిత, వరలక్ష్మి, ఝాన్సీ, ప్రశాంతి, జ్యోతి పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25: పట్టణంలో నిర్వహించే మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లుగౌడ్ కోరారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. 44కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం అన్యాయమన్నారు. 12గంటల పనివిధానం తీసుకురావొద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించి కార్మికుల హక్కులు కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ఇందిరాల వెంకటేశ్వర్లు, జీవీఎల్, పున్నయ్య, పాపారావు, సత్యానందం, సైదులు, వెంకన్న, సుబ్బారావు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారులకు సన్మానం

నేరేడుచర్ల, ఏప్రిల్ 25: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో పశువైద్యాధికారులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న పశువైద్యాధికారులు శంకర్‌రావు, రవినాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చల్లా ప్రభాకర్‌రెడ్డి, కర్రి సూర్యనారాయణరెడ్డి, సుంకరి క్రాంతికుమార్, యూసుఫ్, విశ్వనాథం, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థికసాయం

నేరేడుచర్ల, ఏప్రిల్ 25: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పద్మ అనారోగ్యానికి గురికావడంతో ఆమె వైద్యానికి నేరేడుచర్లలోని సిరి సూపర్‌మార్కెట్ యజమాని యారవ సురేష్ తన స్నేహితుల నుంచి ఆర్థిక సాయం ఇప్పించారు. ఆర్థిక రూ.36వేలను పద్మ భర్త వీరయ్యకు గురువారం అందజేశారు.

'ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై విచారణ జరపాలి'

చిలుకూరు, ఏప్రిల్ 25: హైదరాబాద్‌లో జరిగిన ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అనంతుల రాము డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ఆన్‌లైన్‌లో టికెట్లు ఐదు నిమిషాల్లోనే అయిపోయాయని ప్రకటించడం సరికాదన్నారు. టికెట్ల అమ్మకాల్లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. ఎక్కువ మొత్తానికి టికెట్లను బ్లాక్‌లో విక్రయించిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.